సాక్షి
మహబూబాబాద్
శనివారం | 30 | నవంబర్ | 2024



ఉద్యమ కల సాకారం

నాలుగు దశాబ్దాల కల సాకారం కానుంది. కాజీపేట ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

- 8లో▸



ఇన్‌స్టాగ్రామ్ పరిచయమే ప్రాణం తీసింది..

ఇన్‌స్టాగ్రామ్‌లో మహిళతో ఏర్పడిన పరిచయం ఓ యువకుడి హత్యకు దారితీసింది.

- 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.0^{0} /16.4^{0}

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం చలిగాలులు వీస్తాయి. రాత్రివేళ చలితో పాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ప్రియాంకగాంధీకి శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ



మహబూబాబాద్ రూరల్: వయనాడ్ ఎంపీగా భారీ మెజార్టీతో గెలుపొందిన ప్రియాంకగాంధీని మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యుడు పోరిక బలరాంనాయక్ శుక్రవారం ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రియాంకగాంధీ గెలుపులో కీలక పాత్ర పోషించిన కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీకి ఎంపీ బలరాంనాయక్ కృతజ్ఞతలు చెప్పారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలి



బయ్యారం: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డీఎస్పీ తిరుపతిరావు సూచించారు. బయ్యారం పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం రాత్రి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ పోలీసుల పనితీరుతో పాటు రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీకి సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. కార్యక్రమంలో గార్ల–బయ్యారం సీఐ రవికుమార్, ఎస్సై తిరుపతి పాల్గొన్నారు.

మహిళలకు రిజర్వేషన్లు అమలు చేయాలి



నెహ్రూసెంటర్: అన్ని రంగాల్లో మహిళల అభివృద్ధికి 33శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఊకే పద్మ, గుజ్జు కృష్ణవేణి డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో శారద అధ్యక్షతన సంఘం పట్టణ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రిజర్వేషన్ అమలు, హక్కుల సాధనకై సమరశీల పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో మహిళలపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలను అరికట్టేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలని, అందుకు కఠిన చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షురాలిగా బట్టు బిన్నమ్మ, కార్యదర్శిగా పొన్నం రమ, ఉపాధ్యక్షురాలిగా శివ్వారపు శారద, సహాయ కార్యదర్శిగా ధనసరి నాగమణి, కోశాధికారిగా చిలుక మౌనిక ఎన్నికయ్యారు.

ఎంపీడీఓల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక



మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయంలో జిల్లా ఎంపీడీఓల సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నట్లు శుక్రవారం జెడ్పీ డిప్యూటీ సీఈఓ నర్మద శుక్రవారం తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా పెద్దవంగర ఎంపీడీఓ బి.వేణుమాధవ్, ఉపాధ్యక్షులుగా మరిపెడ ఎంపీడీఓ విజయ, ప్రధాన కార్యదర్శిగా కురవి ఎంపీడీఓ కె. వీరబాబు, కోశాధికారిగా నెల్లికుదురు ఎంపీడీఓ డి.బాలరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కేసముద్రం ఎంపీడీఓ జె.క్రాంతి, కమిటీ సభ్యులుగా దంతాలపల్లి ఎంపీడీఓ ఎస్.వివేక్‌రామ్, చిన్నగూడూరు ఎంపీడీఓ రామారావును ఎన్నుకున్నారు. అనంతరం కమిటీ సభ్యులు జెడ్పీ సీఈఓ పురుషోత్తంను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

డిగ్రీ పరీక్షల్లో 23 మంది మాల్‌ప్రాక్టీస్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో శుక్రవారం డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. వివిధ పరీక్ష కేంద్రాల్లో కాపీయింగ్ చేస్తూ 23 మంది విద్యార్థులు పట్టుబడగా వారిని మాల్ ప్రాక్టీస్ కింద బుక్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్.నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ తిరుమలాదేవి, డాక్టర్ వెంకటయ్య తెలిపారు.

సాగుకు నీటి గండం!



'పక్క ఫొటోలో కనిపిస్తున్నది చిన్నగూడూరు మండలం జయ్యారం గ్రామంలోని రామసముద్రం చెరువు. ఈ చెరువు ఆధారంగా 260 ఎకరాల్లో వరిపంట సాగు అవుతుంది. అయితే వానాకాలంలో కురిసిన భారీ వర్షంతో వచ్చిన వరదల వల్ల చెరువు కట్ట తెగిపోయి.. నీరు లేకుండా మారింది. వానాకాలం సాగుచేసిన వరి వరదలకు కొట్టుకుపోయింది. యాసంగిలో ఒక్క ఎకరం కూడా సాగుచేసే పరిస్థితి లేదని రైతులు చెబుతున్నారు.'

యాసంగిలో భారీగా తగ్గనున్న వరి విస్తీర్ణం

- వానాకాలం వర్షాలతో తెగిన చెరువుల కట్టలు
- నీరు లేక ఎడారిని తలపిస్తున్న వైనం
- వేసవిలో మరమ్మతులకు ప్రణాళిక



కట్ట తెగిపోయిన అయోధ్యగ్రామ చెరువు(ఫైల్)

సాక్షి, మహబూబాబాద్: వానాకాలంలో జిల్లాలోని 12 మండలాల్లో రికార్డు స్థాయిలో, మిగిలిన ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. దీంతో 1,590 చెరువులు, కుంటలకు గాను 55చెరువుల కట్టలు తెగిపోయాయి. మరో 72చెరువులకు గండ్లు పడ్డాయి. మొత్తంగా 127 చెరువుల్లో నీరు దిగువకు వెళ్లిపోయింది. చెరువు మధ్యలోని గుంతల్లో మాత్రమే నీరు మిగిలింది. దీంతో చెరువుల కింద యాసంగి వరి సాగుపై నీలినీడలు అలుముకున్నాయి. ఇదిలా ఉండగా చెరువుల కింద ఉన్న 45వేల ఎకరాల్లో ఇసుక మేటలు, రాళ్లకుప్పలతో నిండి ఉండగా మరో 20 వేల ఎకరాల మేరకు పంటలు దెబ్బతిని ఆనవాళ్లు లేకుండా పోయాయి.

యాసంగి పంటకు నీటి కటకట..

భారీ వర్షంతో చెరువులు, కుంటలు తెగిపోయాయి. పలుచోట్ల చెక్ డ్యామ్‌లకు గండ్లు పడ్డాయి. దీంతో ఎడారిని తలపిస్తున్నాయి. కాగా, చెరువుల కింద యాసంగి సాగుకు నీటి గండం పొంచి ఉంది. వానాకాలం అన్ని పంటలు కలిపి 4.26లక్షల ఎకరాలు సాగుచేయగా.. వరి 2.15లక్షల ఎకరాల్లో సాగుచేశారు. అయితే యాసంగి ప్రణాళిక తయారు చేసిన అధికారులు తర్జనభర్జన పడ్డారు. జిల్లాలో మొత్తం 1,590 చెరువులు ఉండగా వీటి ఆధారంగా 95,460 ఎకరాల పంటలకు సాగునీరు అందుతుంది. సహజంగానే వానాకాలంతో పోలిస్తే యాసంగిలో వరి సాగు తగ్గుతుంది. దీనికి తోడు 127 చెరువుల కట్టలు తెగి నీరు కిందికి వెళ్లడంతో దాదాపు 30వేల ఎకరాల మేరకు యాసంగి సాగుచేసే అవకాశం లేదు. అదేవిధంగా చెక్ డ్యామ్‌లు తెగి భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. దీంతో యాసంగిలో మొత్తం పంటలు 2,31,591 ఎకరాల్లో సాగుకు చేసే అవకాశం ఉందని, అందులో 1,49,353 ఎకరాల్లో వరి సాగు అంచనా వేశారు. అయితే ఈ అంచనాలు కూడా తగ్గే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. తెగిపోయిన చెరువులకు తాత్కాలిక మరమ్మతులకు రూ.12కోట్లు అవసరం అన్నారు. అయితే వేసవిలో తాత్కాలిక మరమ్మతులు కాకుండా రూ. 60కోట్ల మేరకు నిధులు మంజూరు చేసి పూర్తిస్థాయి మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది. లేకపోతే వచ్చే వానాకాలం కూడా తెగిన చెరువుల కింది పంటలు సాగు చేసే పరిస్థితి ఉండదు.

నష్టమే మిగిలింది



నాకు రామసముద్రం చెరువు కింద ఎకరంన్నర పొలం ఉంది. రూ. 25 వేలు అప్పు తెచ్చి వరి పంట సాగు చేశాను. వర్షాలకు రామసముద్రం చెరువు కట్ట తెగిపోయింది. పంట పొలం మొత్తం నీట మునిగింది. గత ఏడాది వానాకాలం పంటకు నాలుగు పుట్లు వడ్లు పండాయి. ఇప్పుడు పంట కోద్దామన్నా పుట్టి వడ్లకు మించి చేతికి వచ్చే పరిస్థితి లేదు. యాసంగి సాగుకు నీళ్లు లేవు.

- నరిగే కృష్ణ, రైతు, జయ్యారం

కాలమై కరువైంది..



ఎన్నడు చూడని వర్షం వచ్చింది. మా ఊరి చెరువు తెగిపోయింది. మా ఇండ్లల్లోకి నీళ్లు వచ్చాయి. చెరువు కింద ఉన్న ఎకరం పొలం వానాకాలం పంట నీరు లేక ఎండిపోయింది. ఇప్పుడు యాసంగికి నీళ్లు లేవు. తొందరగా చెరువు కట్ట మరమ్మతు చేస్తే వచ్చే సంవత్సరం వానాకాలం పంటలు సాగుచేసుకుంటాం.

- ఆకుల జగ్గయ్య, రావిరాల

యాసంగికి నీళ్లు లేవు



మా ఊరు బంధం చెరువు కట్ట రెండు చోట్ల తెగిపోయింది. చెరువు కింది ఎకరం పొలం నీరు లేక ఎండిపోయింది. యాసంగి పంట సాగు చేద్దామంటే చెరువులో నీళ్లు లేవు. అధికారులు స్పందించి వర్షాకాలం రాకముందే చెరువు కట్ట మరమ్మతు చేయాలి. భూమినే నమ్ముకొని ఉన్న రైతులను ఆదుకోవాలి.

- బేతమల్ల వెంకన్న, నర్సింహులపేట

కేసీఆర్ పోరాటంతోనే తెలంగాణ రాష్ట్రం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బాలకోటేశ్వర్‌రావు, పక్కన మాజీ ఎంపీ కవిత, మాజీ ఎమ్మెల్యేలు రెడ్యానాయక్, శంకర్‌నాయక్ తదితరులు

- జిల్లా ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే బాలకోటేశ్వర్‌రావు
- మహబూబాబాద్‌లో ఘనంగా దీక్షా దివస్ కార్యక్రమం



మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

మహబూబాబాద్: కేసీఆర్ పోరాట ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని మాజీ ఎమ్మెల్యే, దీక్షా దివస్ కార్యక్రమ జిల్లా ఇన్‌చార్జ్ కొండా బాలకోటేశ్వర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో దీక్షా దివస్ కార్యక్రమం నిర్వహించారు. అమరవీరుల స్తూపం వద్ద నాయకులు నివాళులర్పించారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూల మాలలు వేసి, మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో బాలకోటేశ్వర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో ఆనాడు ఉమ్మడి వరంగల్ జిల్లా కీలక పాత్ర పోషించిందన్నారు. సకలజనుల సమ్మెతో పాటు కేసీఆర్ దీక్ష, ఇతర పోరాటాల ద్వారా రాష్ట్రం సాధించుకున్నామన్నారు. కేసీఆర్ తెలంగాణ ప్రజల కల సహకారం చేశారని, బీఆర్‌ఎస్ తిగిరి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మాజీ ఎంపీ మాలోత్ కవిత మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణకు సాధ్యంకాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. బీఆర్‌ఎస్ పోరాట ఫలితంగానే ప్రభుత్వం లగచర్లలో ఫార్మా కంపెనీ ఏర్పాటును రద్దు చేసుకుందన్నారు. మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రాణాలను పణంగా పెట్టి రాష్ట్రాన్ని సాధించారన్నారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో మళ్లీ ఉద్యమించి బీఆర్‌ఎస్‌ను తిరిగి అధికారంలోకి తీసుకురావాలన్నారు. మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలన్నారు. తిరిగి బీఆర్‌ఎస్ అధికారంలోకి రాగానే ఉద్యమకారులకు సముచితస్థానం ఉంటుందన్నారు. అనంతరం అమరవీరులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ వెంకన్న, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ ఆంగోత్ బిందు, నాయకులు భరత్‌కుమార్‌రెడ్డి, పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, యాకూబ్‌రెడ్డి, బానోత్ రవికుమార్, ఎం.శ్రీనివాస్, ఎర్రబెల్లి మాధవి, కన్నా, వెంకట్‌రెడ్డి, ఫరీద్, ఆయుబ్, జగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.

అలరించిన 'భూకైలాస్'

కురవి:మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయ సత్రాల వద్ద శుక్రవారం రాత్రి భూకైలాస్ పౌరాణిక నాటకాన్ని ప్రదర్శించారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాల మేరకు హైదరాబాద్‌కు చెందిన సురభి వినాయక నాట్య మండలి ఆధ్వర్యంలో వేణుగోపాల్‌రావు బృందం నాటకం ప్రదర్శించింది. భక్తులు ఆసక్తిగా తిలకించారు.



భూకైలాస్ నాటకంలోని ఓ సన్నివేశం

సమస్యలు వస్తే అధికారులే బాధ్యులు

- రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క
- పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ అధికారులపై ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

కొత్తగూడ: గ్రామాల్లో సమస్యలు వస్తే అధికారులే పూర్తి బాధ్యత వహించాల్సి వస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. శాఖల వారీగా సమస్యలను గుర్తించాలని ఆదేశించారు. ఇప్పుడు సమస్యలు లేవని చెప్పి రేపు ఏదైనా సమస్య వస్తే మాత్రం తీవ్రతను బట్టి అధికారులను సర్వీస్ నుంచి తొలగించడాకి కూడా వెనుకాడబోమని తీవ్రంగా హెచ్చరించారు. అభివృద్ధి పనులను అడ్డుకోవద్దని, అడవికి నష్టం జరగకుండా గుంజేడు జాతర అభివృద్ధి జరిపించాలని ఎఫ్‌డీఓ చంద్రశేఖర్‌కు సూచించారు.

వినతుల వెల్లువ..

గంగారం మండలంలో విధులు నిర్వహించి తిరిగి వెళ్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నూతన ఉపాధ్యాయుడు ఉపేందర్ కుటుంబాన్ని ఆదుకోవాలని టీడబ్ల్యూటీ నాయకులు మంత్రికి వినతిపత్రం అందించారు. మండల కేంద్రంలోని పశు వైద్యశాలకు భవన నిర్మాణం చేపట్టాలని యాదవ సంఘం నాయకులు వినతిపత్రం అందించారు.

ప్రజలు సంతోషంగా ఉన్నారు..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాపాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని మంత్రి సీతక్క అన్నారు. జీర్ణించుకోలేని బీఆర్‌ఎస్ నాయకులు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. మెస్‌చార్జీలు పెంచిన తర్వాత గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ వెనుక కుట్ర ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. ఏజెన్సీ గ్రామాల రైతులకు పోడు పట్టాలతో పాటు బ్యాంకు రుణాలు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు సారయ్య, రూప్‌సింగ్, పుష్పలత, రణధీర్, ముసుకు వెంకన్న, మొగిలి, బొల్లు రమేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పనుల ఆలస్యంపై ఆగ్రహం..

కొత్తగూడ, గంగారం మండలాల్లో రోడ్ల పనుల ఆలస్యంపై పీఆర్, ఆర్‌అండ్‌బీ అధికారులపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పనులు ప్రారంభించి మూడు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. గుంజేడు రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలని, పాకాల నుంచి గంగారం వరకు డబుల్ రోడ్డుకు నివేదికలు, దుబ్బగూడెం రోడ్డు పనుల స్టేటస్‌తో రావాలని సూచించారు. వేసవిలో రెండు మండలాల్లో తాగునీటి సమస్య రావద్దని మిషన్ భగీరథ అధికారులకు సూచించారు. ఏకలవ్య గురుకుల పాఠశాలకు తాగునీరు అందించేందుకు వెంటనే ఏర్పాట్లు చేయాలని ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రాకు ఫోన్‌లో సూచించారు. ఐసీడీఎస్, ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలల పనితీరు, అవసరాలపై సమీక్షించారు.

సైన్స్ పండుగకు వేళాయె

- నేటి నుంచి జిల్లాస్థాయి సైన్స్‌ఫెయిర్, ఇన్‌స్పైర్
- అనంతారం మోడల్ స్కూల్‌లో ఏర్పాట్లు పూర్తి



ముస్తాబైన అనంతారం మోడల్ స్కూల్

మహబూబాబాద్ అర్బన్: నూతన ఆవిష్కరణలకు వేదికగా నిలిచే బాల వైజ్ఞానిక ప్రదర్శనలకు సమయం ఆసన్నమైంది. శని, ఆదివారాల్లో జిల్లా స్థాయి ఇన్‌స్పైర్, సైన్స్‌ఫెయిర్ ప్రదర్శనలు జరగనున్నాయి. ఈమేరకు మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని అనంతారం మోడల్ స్కూల్‌లో ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా విద్యాశాఖ సైన్స్ అధికారి అప్పారావు, డీఈఓ రవీందర్‌రెడ్డి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి సైన్స్ ఫెయిర్ పోటీల్లో విద్యార్థులు పాల్గొనేలా చర్యలు తీసుకున్నారు.

విద్యార్థుల ఖాతాల్లో డబ్బులు జమ..

జిల్లాలో అన్ని యాజమాన్యాల పాఠశాలల నుంచి 6నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులు ఇన్‌స్పైర్, సైన్స్‌ఫెయిర్ ప్రదర్శనల్లో పోటీ పడనున్నారు. కాగా ఈ పోటీలకు ఎంపికైన విద్యార్థుల ఖాతాల్లో రూ.10వేల చొప్పున డబ్బులు జమ చేశారు. వారు తమ ఎగ్జిబిట్లను ప్రదర్శించనున్నారు. మొత్తం ప్రదర్శనల్లో 10శాతం మేరకు ఎగ్జిబిట్లను రాష్ట్రస్థాయికి ఎంపిక చేయనున్నారు. కాగా ఇన్‌స్పైర్ ప్రదర్శనలో ప్రధాన అంశం సుస్థిర అభివృద్ధిలో సాంకేతికత పాత్ర ఏడు ఉప అంశాలుగా ఉంటాయి. దీనిలో ఏదైనా అంశం ఎంచుకుని ఎగ్జిబిట్లను ప్రదర్శించి రాష్ట్ర, జాతీయస్థాయి, అనంతరం రాష్ట్రపతి భవన్ వరకు వెళ్లే అవకాశం ఉంది.

14ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి..

సీనియర్, జూనియర్ విభాగంలో ప్రతీ అంశంలో ఒక ఎగ్జిబిట్ చొప్పున మొత్తం 14 ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారు. అనంతరం దక్షిణ భారతదేశ స్థాయి, జాతీయ స్థాయికి ఎంపికయ్యే అవకాశం ఉంటుంది. జాతీయస్థాయి ప్రదర్శనలకు ఎంపికైన విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత సాంకేతిక శాస్త్ర సంస్థల్లో నిర్దేశిత సైన్స్ కోర్సులో చదవడానకి రిజర్వేషన్ అమలవుతుంది. ఇన్స్‌ఫెయిర్ పోటీల్లో భాగంగా రాష్ట్రపతిభవన్‌లో అత్యుత్తమంగా నిలిచిన 8 ప్రదర్శనలకు జపాన్‌కు చెందిన సకూర సంస్థ భాగస్వామ్యంతో పేటెంట్ హక్కులు కల్పిస్తారు. అవసరం మేరకు ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేయనున్నారు. విద్యార్థులు భావిశాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు బాటలు పడతాయి.


కమిటీలు

ఇన్‌స్పైర్, సైన్స్‌ఫెయిర్ ప్రదర్శనలకు 16 కమిటీలు ఏర్పాటు చేశారు. ఎంఈఓలు కన్వీనర్లుగా, ప్రధానోపాధ్యాయులు కోకన్వీనర్లుగా, ఉపాధ్యాయులు సభ్యులుగా వ్యవహరిస్తారు.

ఇన్‌స్పైర్ వివరాలు
మొత్తం వచ్చిన దరఖాస్తులు 1,100
ఎంపికైనవి: 83
విద్యార్థుల ఖాతాల్లో రూ. 8.30 లక్షలు జమ
గైడ్ టీచర్లు: 83 మంది

సైన్స్‌ఫెయిర్ వివరాలు
మొత్తం వచ్చిన, ఎంపికైన దరఖాస్తులు: 140
గైడ్ టీచర్లు: 140 మంది
మొత్తం: 16 కమిటీలు

సృజనాత్మకతను వెలికితీయడానికి..



విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడానికి సైన్స్‌ఫెయిర్, ఇన్‌స్పైర్ ప్రదర్శనలు ఎంతగానో ఉపయోగపడుతాయి. సైన్స్ ప్రదర్శనల ద్వారా విద్యార్థులు నూతనంగా ఆలోచించే అవకాశం ఉంటుంది. రెండు రోజుల పాటు నిర్వహించే ఇన్‌స్పైర్ ప్రదన్శనలను విద్యార్థులు తిలకించేందుకు ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి.

- రవీందర్‌రెడ్డి. జిల్లా విద్యాశాఖ అధికారి

పేదలను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు: పేదలను ఆదుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని ఆయా గ్రామాల లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. 163 మంది లబ్ధిదారులకు రూ.56.42 లక్షల విలువ చేసే చెక్కులు ఎమ్మెల్యే చేతుల మీదుగా లబ్ధిదారులకు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ..ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేరి ఆర్థికంగా చితికిన బాధితులకు ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక చేయూత అందిస్తుందన్నారు. పేదలను ఆదుకోవడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని, ఆరు మండలాల్లో మౌలిక సౌకర్యాల కల్పనే ధ్యేయమన్నారు. సమగ్ర కుటుంబ సర్వే చారిత్రాత్మకమని, సర్వేతో పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, నాయకులు కేతిరెడ్డి నిరంజన్‌రెడ్డి, హామ్యానాయక్, సుంచు సంతోష్, సోమ రాజశేఖర్, జినుగ సురేందర్‌రెడ్డి, మేకల కుమార్, చాపల బాపురెడ్డి, ధరావత్ సోమన్న, ముద్దసాని సురేష్ పాల్గొన్నారు.

అర్ధనారీశ్వర అలంకరణలో రామలింగేశ్వరస్వామి



వెంకటాపురం(ఎం): ప్రపంచ ప్రసిద్ధి చెందిన రామప్ప దేవాలయంలోని రామలింగేశ్వరస్వామి శుక్రవారం అర్ధనారీశ్వర అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చాడు. కార్తీక మాసం చివరి శుక్రవారం కావడంతో అర్ధనారీశ్వర అలంకరణ చేసినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు కోమల్లపల్లి హరీశ్‌శర్మ తెలిపారు. అలాగే రామప్ప ఆలయాన్ని ట్రైనీ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు సందర్శించి రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేయగా, ఆలయ విశిష్టత గురించి గైడ్ గోరంట్ల విజయ్‌కుమార్ వివరించారు.

నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదు

- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ ఆగ్రహం
- కల్వల మోడల్‌స్కూల్ ఆకస్మిక తనిఖీ



ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్

కేసముద్రం: విద్యార్థులకు అందించే భోజనం విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అధికారులు, నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని కల్వల మోడల్ స్కూల్‌ను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ మేరకు మధ్యాహ్న భోజనం ఎలా పెడుతున్నారని విద్యార్థులను ఎమ్మెల్యే ప్రశ్నించగా, నాణ్యత ఉండటం లేదని బదులిచ్చారు. నాణ్యమైన భోజనం అందించాలని వంట నిర్వాహకులు, టీచర్లను ఆదేశించారు. అనంతరం మోడల్‌స్కూల్ హాస్టల్‌కు వెళ్లారు. 20మంది విద్యార్థినులకు మధ్యాహ్న భోజనంలో వండేందుకు కిలో ఆలుగడ్డ, కిలో టమాటాలు, 100గ్రాముల నూనె మాత్రమే ఉండడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. 20మంది పిల్లలకు ఎలా సరిపోతాయని ప్రశ్నించారు. తమకు వార్డెన్ ఇవే ఇచ్చి వెళ్లారని నిర్వాహకులు బదులిచ్చారు. దీంతో వెంటనే ఆయన డీఈఓకు ఫోన్ చేసి హాస్టల్‌లో ఉండే పిల్లలపై నిర్లక్ష్యం తగదని, మరోసారి ఇలా జరిగితే సహించేది లేదన్నారు. మరోసారి వచ్చి హాస్టల్‌ను తనిఖీ చేస్తానని మార్పు రాకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకుముందు డీఈఓ రాజేందర్‌రెడ్డి మోడల్‌స్కూల్‌ను సందర్శించి వెళ్లారు. కేసముద్రం మార్కెట్ చైర్మన్ సంజీవరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, నాయకులు మహేందర్‌రెడ్డి, దస్రూనాయక్, వెంకన్న, దయాకర్, శ్రీనివాస్‌రెడ్డి, గండి శ్రీను, అశోక్‌రెడ్డి, టీచర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి జాతీయ స్థాయి టెన్నిస్‌ పోటీలు

వరంగల్‌ స్పోర్ట్స్‌: ఆల్‌ ఇండియా టెన్నిస్‌ అసోసియేషన్‌ సహకారంతో వరంగల్‌ జిల్లా టెన్నిస్‌ అసోసియేషన్‌, వరంగల్‌ క్లబ్‌ సంయుక్త ఆధ్వర్యంలో నేటి నుంచి జాతీయ స్థాయి టెన్నిస్‌ టోర్నమెంట్‌ నిర్వహిస్తున్నట్లు క్లబ్‌ అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణరెడ్డి, మనోహర్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీనివాస్‌ గౌడ్‌ స్మారకార్థం నిర్వహించే టోర్నమెంట్‌ ఈ నెల 30 నుంచి డిసెంబర్‌ 7వ తేదీ వరకు ఓపెన్‌ మెన్స్‌ కేటగిరీలో జరగనున్నట్లు వెల్లడించారు. సుబేదారిలోని వరంగల్‌ క్లబ్‌ వేదికగా జరిగే టోర్నమెంట్‌లో విజేత జట్టుకు రూ.2.5 లక్షల నగదు పురస్కారంతో సత్కరించనున్నట్లు పేర్కొన్నారు. శనివారం ఉదయం 9గంటలకు ప్రారంభమయ్యే పోటీలకు నగర పోలీస్‌ కమిషనర్‌ అంబర్‌ కిషోర్‌ ఝా, కలెక్టర్‌ ప్రావీణ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు.

షార్ట్‌ సర్క్యూట్‌తో ఇల్లు దహనం

- రూ.2లక్షల ఆస్తి నష్టం


కాలిపోయిన ఇంటి ఎదుట బాధితులు

స్టేషన్‌ఘన్‌పూర్‌: జనగామ జిల్లా స్టేషన్‌ ఘన్‌పూర్‌ మండలంలోని నమిలిగొండలో ప్రమాదవశాత్తు బోనగిరి సాంబరాజుకు చెందిన ఇల్లు, ఇంటిలో వస్తువులు దహనమై రూ.2లక్షల ఆస్తి నష్టం వాటిల్లిన ఘటన శుక్రవారం జరిగింది. బాధితులు సాంబరాజు, అపర్ణ దంపతులు తెలిపిన వివరాలు ప్రకారం.. నమిలిగొండ గ్రామానికి చెందిన సాంబరాజు హమాలీ పని చేస్తుండగా అతని భార్య వ్యవసాయ కూలీగా కుటుంబాన్ని పోషిస్తున్నారు. రోజు మాదిరిగానే శుక్రవారం వారు పనులకు, పిల్లలు పాఠశాలకు వెళ్లారు. మధ్యాహ్న సమయంలో ఇంట్లో షార్ట్‌ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ఇంట్లోని టీవీ, మంచాలు తదితర ఫర్నీచర్‌, దుస్తులు, బియ్యం బస్తాలు, రూ.30వేలు నగదు కాలిబూడిదయ్యాయి. ఇంట్లో నుంచి పొగలు రావడం గమనించిన చుట్టుపక్కల వారు సాంబరాజుకు సమాచారం అందించారు. స్థానికుల సాయంతో మంటలను అదుపుచేశారు. కానీ, అప్పటికే వస్తువులన్నీ అగ్నికి ఆహుతయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసు, రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. షార్ట్‌ సర్క్యూట్‌తో ఇల్లు, సామగ్రి కాలిపోవడంతో మాజీ ఎంపీటీసీ సభ్యుడు పురమాని రజాక్‌యాదవ్‌, కాంగ్రెస్‌ నాయకుడు కుందూరు అశోక్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబానికి రూ.5వేలు అందించారు. విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి సాయం అందించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

కాజీపేట మండలం అయోధ్యపురంలో కొనసాగుతున్న రైల్వే వ్యాగన్‌ షెడ్‌ నిర్మాణాలు




ఉద్యమ కల సాకారం

కాజీపేట రైల్వే కోచ్‌ ఫ్యాక్టరీ కోసం 45ఏళ్లు సాగిన పోరాటం

- 1977–1978లో ఆజంజాహి మిల్లులో కార్మికుల తొలగింపుతో తెరపైకి కోచ్‌ ఫ్యాక్టరీ నినాదం
- 1979లో కమ్యూనిస్టులు భగవాన్‌దాస్‌, కాళిదాస్‌ ఆధ్వర్యంలో ఉద్యమం
- తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర విభజన చట్టంలో కీలక అంశంగా కోచ్‌ ఫ్యాక్టరీ ప్రస్తావన
- కోచ్‌ ఫ్యాక్టరీ, డివిజన్‌ కోసం 13 ఏళ్లు పోరాడిన రైల్వే జేఏసీ
- పీపుల్స్‌వార్‌, మావోయిస్టుల మద్దతు



నెరవేరనున్న కల

పదమూడున్నరేళ్ల రైల్వే జేఏసీ ఉద్యమంతో కాజీపేటకు రైల్వే వ్యాగన్‌ పీఓహెచ్‌ షెడ్‌, కాజీపేట రైల్వే కోచ్‌ ఫ్యాక్టరీ ఏర్పాటు, నేడు కాజీపేట రైల్వే డివిజన్‌ ఏర్పాటుకు బాటలు పడ్డాయి. దీంతో నాలుగు దశాబ్దాల కల సాకారం కానుందని ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కాజీపేట రూరల్‌: ఉమ్మడి జిల్లా ప్రజల ఉపాధికి పెద్దదిక్కుగా ఉన్న నాటి ఆజంజాహి మిల్లులో కార్మికుల సంఖ్యను మెల్లమెల్లగా తగ్గిస్తున్న నేపథ్యంలో.. నాటి కామ్రేడ్లు భగవాన్‌దాస్‌, కాళిదాస్‌ ఉమ్మడి జిల్లాలో ప్రత్యామ్నాయ ఉపాధి కోసం కాజీపేటలో రైల్వే కోచ్‌ ఫ్యాక్టరీని తెరపైకి తీసుకొచ్చారు. ఊరూరా ఉద్యమించి గల్లీ నుంచి ఢిల్లీ వరకు కోచ్‌ ఫ్యాక్టరీ నినాదాన్ని తీసుకెళ్లి సక్సెస్‌ అయ్యారు. వారి పోరాట స్ఫూర్తితో రాజకీయ పార్టీలు, సంఘాలకు అతీతంగా కాజీపేట, వ్యాగన్‌ షెడ్‌, కోచ్‌ ఫ్యాక్టరీ, కాజీపేట డివిజన్‌ కోసం కాజీపేట తెలంగాణ రైల్వే జేఏసీ నాయకులు 13 ఏళ్లపాటు సుదీర్ఘ పోరాటం చేశారు. ఈనేపథ్యంలో రైల్వే వ్యాగన్‌, కోచ్‌ ఫ్యాక్టరీ, డివిజన్‌పై 'సాక్షి' ప్రత్యేక కథనం.

ఆజంజాహి కార్మికుల తొలగింపు.. కోచ్‌ ఫ్యాక్టరీ ఉద్యమం..

జిల్లాలోని ఆజంజాహి మిల్లులో 1977–78లో కార్మికుల తొలగింపు ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో కాజీపేటలో రైల్వే కోచ్‌ ఫ్యాక్టరీ నిర్మాణం చేస్తే జిల్లాలో కొంత వరకు నిరుద్యోగ సమస్య తీరుతుందని గ్రహించిన నాటి కామ్రేడ్లు భగవాన్‌దాస్‌, కాళిదాస్‌ 1978లో ఉద్యమం చేపట్టారు. ఊరూరా సైకిల్‌ యాత్రలు చేపట్టి ప్రజలను చైతన్యవంతం చేశారు. బ్రిటీష్‌, నిజాం సర్కార్‌ కాలంలో ఇల్లందులో బొగ్గుగనుల కేంద్రం నుంచి బొగ్గు గనులు తీసి, ట్రైన్‌ కోచ్‌ షీట్స్‌ హీట్‌ చేసేవారు. ఇల్లందులో కోల్‌ మైనింగ్‌ కేంద్రం ఉంది.. కావున కాజీపేటలో రైల్వే కోచ్‌ ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టాలనే ఉద్యమం ఎగిసింది. కాజీపేట– మద్రాస్‌ వరకు అప్పట్లో సింగిల్‌లైన్‌ ఉంది. జిల్లాలో కోచ్‌ ఫ్యాక్టరీ కోసం ఉద్యమిస్తున్న సమయంలోనే మద్రాస్‌లో వ్యాగన్‌ వర్క్‌షాప్‌ నెలకొల్పారు. తర్వాత కోచ్‌ ఫ్యాక్టరీ ఏర్పాటు చేశారు. ఇది కూడా జిల్లా నుంచి మద్రాస్‌కు కోచ్‌ ఫ్యాక్టరీ తరలిపోయిందని చెప్పవచ్చును. ఈక్రమంలో 1982లో కోచ్‌ ఫ్యాక్టరీ ఉద్యమం తీవ్రంగా సాగింది. అదే సమయంలో జిల్లాకు ఆర్డినెన్స్‌ ఫ్యాక్టరీ కూడా మంజూరు అయి తెరమరుగైంది.

వ్యాగన్‌షెడ్‌ నిర్మాణం

అయోధ్యపురం వద్ద 160 ఎకరాల్లో వ్యాగన్‌ పీఓహెచ్‌ షెడ్‌ నిర్మాణానికి ప్రధాని నరేంద్రమోదీ గత సంవత్సరం శంకుస్థాపన చేశారు. ఇప్పటి వరకు 65 శాతం పనులు పూర్తికాగా.. 2025 ఆగస్టులో వ్యాగన్‌ పీఓహెచ్‌ షెడ్‌ ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నారు.

2009లో వ్యాగన్‌ షెడ్‌ మంజూరు

కాజీపేట రైల్వే డివిజన్‌, కోచ్‌ ఫ్యాక్టరీ ఉద్యమ నేపథ్యంలో 2009లో నాటి రైల్వే మంత్రి మమతా బెనర్జీ హయాంలో కాజీపేటకు రైల్వే వ్యాగన్‌ షెడ్‌ మంజూరైంది. తర్వాత కాజీపేటలో ఎలక్ట్రిక్‌ షెడ్‌ నిర్మాణం జరిగింది. 2011లో తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో కాజీపేట తెలంగాణ రైల్వే జేఏసీ కన్వీనర్‌ దేవులపల్లి రాఘవేందర్‌, చైర్మన్‌ కొండ్ర నర్సింగరావు నేతృత్వంలో రైల్వే కోచ్‌ ఫ్యాక్టరీ, కాజీపేట డివిజన్‌ ప్రస్తావన బలంగా ముందుకు సాగింది. తర్వాత్తర్వాత రైల్వే కోచ్‌ ఫ్యాక్టరీ, డివిజన్‌ ప్రస్తావన రాజకీయ అంశంగా మారి తెలంగాణ ఉద్యమంలో ప్రధాన డిమాండ్లుగా నిలిచాయి.

1983లో కమిటీ ఏర్పాటు

ప్రధానిగా ఇందిరాగాంధీ ఉన్న సమయంలో కెబినెట్‌లో తెలంగాణ నుంచి మానవవనరుల శాఖ మంత్రిగా పీవీ నర్సింహారావు కొనసాగారు. ఆసమయంలో భగవాన్‌దాస్‌, కాళిదాస్‌ల పోరాటంతో 1983లో జిల్లాలో రైల్వే కోచ్‌ ఫ్యాక్టరీ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేయాలని ఇందిరాగాంధీ కమిటీ వేసింది. భూసేకరణ కూడా జరిగింది. అదే ఏడాది (1983)లో ఎన్నికలు వచ్చాయి. ఎన్నికల్లో జిల్లా నుంచి పీవీ నర్సింహారావు ఓటమి చెందారు. బీజేపీ, టీడీపీ అలయన్స్‌తో కోచ్‌ ఫ్యాక్టరీ నినాదంతో జంగారెడ్డి ఎంపీ అయ్యారు. హనుమకొండ నుంచి ఓటమి చెందిన పీవీ.. నాగపూర్‌ రాంటెక్‌ నుంచి విజయం సాధించారు.

ఇంటిగ్రేటెడ్‌ కోచ్‌ ఫ్యాక్టరీకి గ్రీన్‌ సిగ్నల్‌

కాజీపేటలో వ్యాగన్‌ షెడ్‌ నిర్మాణ పనులు కొనసాగుతుండగా కేంద్రం కాజీపేటకు ఇంటిగ్రేటెడ్‌ కోచ్‌ ఫ్యాక్టరీ నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్‌ ఇచ్చింది. ఆర్‌వీఎన్‌ఎల్‌ సంస్థ కాజీపేట వ్యాగన్‌షెడ్‌లో కోచ్‌ ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టింది. ఇప్పటికే కోచ్‌ ఫ్యాక్టరీకి రూ.580 కోట్లు, మరో దఫా రూ.66 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఇదిలా ఉండగా ప్రస్తుతం కాజీపేట రైల్వే డివిజన్‌ ఏర్పాటుకు సైతం రైల్వేశాఖ గ్రీన్‌సిగ్నల్‌ ఇచ్చింది. కాజీపేట రైల్వే డివిజన్‌కు కావాల్సిన సరిహద్దులు ఏర్పాటు చేయాలని రైల్వే జీఎంకు ఆదేశాలు జారీ చేసింది. కాజీపేట వ్యాగన్‌, కోచ్‌ ఫ్యాక్టరీ ఏర్పాటు అయితే ప్రత్యక్షంగా.. పరోక్షంగా సుమారు 10 వేల మందికి ఉపాధి లభించనుంది

స్థానికులకు ఉపాధి కల్పించాలి



పంజాబ్‌లోని కపుర్తాల కోచ్‌ఫ్యాక్టరీలో ఉద్యోగాలు భర్తీ చేసిన విధంగానే కాజీపేట రైల్వే వ్యాగన్‌షెడ్‌, కోచ్‌ఫ్యాక్టరీలో స్థానిక నిరుద్యోగులకు అవకాశం కల్పించాలి. లేదంటే ఉద్యమిస్తాం. కేంద్ర ప్రభుత్వం రెండు రైల్వే పరిశ్రమలను నెలకొల్పుతున్నందుకు, స్థలం ఇచ్చిన ఆనాటి రాష్ట్ర ప్రభుత్వానికి రైల్వే జేఏసీ తరఫున కృతజ్ఞతలు.

– దేవులపల్లి రాఘవేందర్‌, రైల్వే జేఏసీ కన్వీనర్‌

ప్రజా ఉద్యమాలదే విజయం



జిల్లాలో 45 ఏళ్ల ప్రజా ఉద్యమ చరిత్ర గల రైల్వే కోచ్‌ ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వే డివిజన్‌ మంజూరుకు ఆనాడు చేస్తున్న అనేక ఉద్యమాలకు పీపుల్స్‌వార్‌ సైతం మద్దతు ప్రకటించారు. రైల్వే జేఏసీ రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ, రైల్వే వ్యాగన్‌ షెడ్‌, కాజీపేట డివిజన్‌ ఏర్పాటు కోసం చేస్తున్న ఉద్యమాలకు మావోస్టు పార్టీ కూడా మద్దతు పలుకుతున్నట్లు ప్రకటించడం జరిగింది. ప్రజా ఉద్యమాలు ఎప్పటికైనా విజయం సాధిస్తాయి.

– కొండ్ర నర్సింగరావు, రైల్వే జేఏసీ చైర్మన్‌

ఇన్‌స్టాగ్రామ్‌ పరిచయమే ప్రాణం తీసింది..

- మహిళ వద్ద అప్పు తీసుకున్న యువకుడు
- ఫోన్‌ సంభాషణలతో అనుమానం పెంచుకున్న మహిళ భర్త
- ప్లాన్‌ ప్రకారం యువకుడి హత్య
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ, ఎస్సైలు

కాళేశ్వరం: ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన మహిళ వడ్డీలకు అప్పులు ఇస్తుందని తెలుసుకున్న ఓ యువకుడు ఆమె సోదరుడి ద్వారా రూ.లక్ష అప్పుగా తీసుకున్నాడు. ఈక్రమంలో మహిళతో తరచూ ఫోన్‌లో మాట్లాడేవాడు. దీంతో ఆమె భర్తకు అనుమానం పెరిగి అపార్థం చేసుకొని యువకుడిని హత్య చేశాడు. జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌ మండలం చంద్రుపల్లిలో గత బుధవారం జరిగిన ఈ హత్యకు సంబంధించి శుక్రవారం రాత్రి కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. మంచిర్యాల జిల్లా చెన్నూర్‌ మండలం కొమ్మెర గ్రామానికి చెందిన ముత్యాల శ్రీకాంత్‌గౌడ్‌(24) పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం చందనాపూర్‌ గ్రామానికి చెందిన వాటర్‌ ప్లాంట్‌ నిర్వాహకుడు పొన్నం శివకృష్ణగౌడ్‌ భార్యతో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం పెంచుకున్నాడు. ఆ మహిళ సోదరుడు పవన్‌, శ్రీకాంత్‌గౌడ్‌ ఇద్దరూ స్నేహితులు కావడంతో ఆమె వద్ద రూ.లక్ష అప్పుగా తీసుకున్నాడు. ఆ అప్పు విషయంలో వారిద్దరు తరచూ ఫోన్‌లో మాట్లాడుకునేవారు. గమనించిన ఆమె భర్త పలుమార్లు మహిళను మందలించాడు. ఫోన్‌లో మాట్లాడడంతోపాటు, వారిద్దరు దగ్గరయ్యారనే అనుమానంతో శివకృష్ణ, అతని స్నేహితుడు ఎండీ ఫయాజ్‌తో కలిసి శ్రీకాంత్‌ను చంపాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో కొమ్మెర గ్రామానికి చెందిన కిరాణ దుకాణం నిర్వాహకుడు కురుమ సాయితో పరిచయం పెంచుకుని శ్రీకాంత్‌ కదలికలను తెలుసుకున్నాడు. ఈ నెల 27వ తేదీన (బుధవారం) గ్రామంలో రెక్కీ నిర్వహించగా అక్కడ లేడని, అన్నారం సమీపంలోని చంద్రుపల్లిలో హార్వెస్టర్‌ నడిపిస్తున్నట్లు సాయి తెలిపాడు. దీంతో శివకృష్ణ, అతని స్నేహితుడు ఫయాజ్‌.. సాయి దుకాణంలో బీర్లు, ఆ తర్వాత కల్లు తాగి మహదేవపూర్‌ మండలం చంద్రుపల్లికి వచ్చారు. అక్కడ హార్వెస్టర్‌ డ్రైవర్‌ కోసం తన కారులో వేచి చూస్తున్న శ్రీకాంత్‌తో గొడవపడ్డారు. వెంటతెచ్చుకున్న కత్తితో ఛాతి, కడుపులో విచక్షణారహితంగా పొడవగా శ్రీకాంత్‌ అక్కడికక్కడే మృతిచెందడంతో బైక్‌ వదిలేసి పారిపోయారు. దీంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. హత్యచేసిన రోజు ధరించిన రక్తపుదస్తులు, కత్తి, హెల్మెట్‌ దాచి ఉంచిన స్థలానికి శుక్రవారం నిందితులు చేరుకోగా చంద్రుపల్లి వద్ద మహదేవపూర్‌ సీఐ రామచంద్రరావు, ఎస్సైలు చక్రపాణి, పవన్‌కుమార్‌, తమాషారెడ్డిలతోపాటు పోలీసులు పట్టుకున్నారు. వారినుంచి పల్సర్‌ బైక్‌, కత్తి, రక్తపు మరకలతో ఉన్న దుస్తులు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి మృతి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ కారణాలతో ముగ్గురు మృత్యువాత పడ్డారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.


రవి(ఫైల్‌)

విద్యుదాఘాతంతో వ్యక్తి..


భూపాలపల్లి రూరల్‌: అడవిపందుల కోసం వేసిన విద్యుత్‌ తీగలకు తగిలి రైతు మృతి చెందాడు. ఈ ఘటన భూపాలపల్లి జిల్లా నేరేడుపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నేరేడుపల్లి గ్రామ శివారులమేకల రవి(36) అనే రైతు శుక్రవారం మధ్యాహ్నం తన వ్యవసాయ భూమి వద్దకు బయలుదేరాడు. ఆదేగ్రామానికి చెందిన వెంబడి సమ్మయ్య, ఎంబడి శీనులు అడవి పందుల కోసం పెట్టిన కరెంటు వైర్‌లను నిర్లక్ష్యంగా వదిలేశారు. రవి ఆ తీగలకు తగిలి చనిపోయాడు. ఈ మేరకు మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించినట్లు సీఐ నరేష్‌ తెలిపారు.మృతుడికి ఇద్దరు పిల్లలు, తల్లి ఉన్నారు.

గడ్డిగూడెం తండాలో..


వీరన్న (ఫైల్‌)

మహబూబాబాద్‌ రూరల్‌ : విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మహబూబాబాద్‌ మండలంలోని గడ్డిగూడెం తండాలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మహబూబాబాద్‌ మండలంలోని గడ్డిగుడెం తండా గ్రామానికి చెందిన ధరావత్‌ వీరన్న (45) పొలం పనులకు వెళ్లివచ్చి స్నానం కోసమని నీళ్లు హీటర్తో వేడి చేసుకున్నాడు. ఈక్రమంలో బకెట్‌ నుంచి హీటర్‌ తీస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై శరీరంపై తీవ్ర గాయాలై పడిపోయాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు వచ్చి చూసేలోగా వీరన్న మృతిచెందాడు. పోలీసులకు సమాచారం ఇవ్వగా బ్లూకోల్ట్స్‌ పీసీలు విజయ్‌, సంపత్‌ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రికి తరలించారు. విద్యుత్‌ శాఖ సబ్‌ ఇంజనీర్‌ వెంకటేశ్‌, సిబ్బంది సాగర్‌ ప్రమాద ప్రాంతాన్ని పరిశీలించారు. మృతుడి భార్య శాంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్‌ ఎస్సై దీపికారెడ్డి తెలిపారు.

అంత్యక్రియలకు వెళ్లొస్తూ..


రమేశ్‌(ఫైల్‌)

టేకుమట్ల: అంత్యక్రియలకు వెళ్లొస్తూ రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన జయశంకర్‌ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని బండపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల మండల కేంద్రానికి చెందిన తాటికంటి రాజయ్య మృతి చెందగా ఆయన అంత్యక్రియలకు.. మొగుళ్లపల్లి మండలంలోని నర్సింగాపూర్‌కి చెందిన శనిగరపు రమేశ్‌(45) హాజరై, టేకుమట్ల మండలంలోని కుందనపల్లికి వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో బండపల్లి శివారులో ద్విచక్ర వాహనం అదుపు తప్పి బురదలో పడిపోయాడు. దీంతో ఊపిరాడక మృతి చెందాడు. కాగా, బతుకుదెరువు కోసం హైదరాబాద్‌లో ఉంటున్న రమేశ్‌ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వచ్చి తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్‌ తెలిపారు.

పేదింటికి పెద్ద జబ్బు


దీన గాథ

- రెండు కిడ్నీలు పోయి.. మంచంపట్టి..
- డయాలసిస్‌తో నెట్టుకొస్తున్న యువకుడు
- కిడ్నీ ఇచ్చేందుకు సమ్మతించిన తండ్రి
- ఆర్థిక స్థోమత లేక ఆపరేషన్‌కు దూరం


ఆస్పత్రిలో డయాలసిస్‌ చేయించుకుంటున్న ఉపేందర్‌

కురవి: భార్య, ఇద్దరు పిల్లలతో హాయిగా జీవిస్తున్న ఓ పేదింటి యువకుడు రెండు కిడ్నీలు చెడిపోయి మంచం పట్టాడు. మహబూబాబాద్‌ జిల్లా కురవి మండలం నేరడ గ్రామానికి చెందిన ఇటికాల వెంకటయ్య–ఉప్పలమ్మల పెద్ద కుమారుడు ఉపేందర్‌ మానుకోటలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో కాంపౌండర్‌గా పనిచేస్తున్నాడు. అదే ఆస్పత్రిలో భార్య పార్వతి ఏఎన్‌ఎంగా పనిచేస్తోంది. వీరికి అర్షిత 8వ తరగతి, నందిత 3వ తరగతి ఉన్నారు. ఉపేందర్‌కు 8 నెలల క్రితం ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఆస్పత్రిలో చెక్‌ చేయించుకున్నాడు. కిడ్నీలు చెడిపోయాయని వైద్యులు నిర్ధారించారు. దీంతో హైదరాబాద్‌లో మరోమారు పరీక్ష చేయించాడు. అక్కడ కూడా అదే విషయాన్ని చెప్పిన వైద్యులు డయాలసిస్‌ చేయాల్సి ఉంటుందని సూచించారు. ఈనేపథ్యంలో 8 నెలల నుంచి వారానికి రెండు సార్లు మానుకోటలో డయాలసిస్‌ చేయించుకుంటున్నాడు. నిత్యం ఆస్పత్రికి వెళ్లడం.. అనారోగ్యంపాలు కావడంతో భార్యభర్తలు ఆస్పత్రిలో ఉద్యోగం మానేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో కుటుంబం గడవడం కష్టంగా మారింది. ఈక్రమంలో ఆపరేషన్‌ చేస్తే ఒక్క కిడ్నీతో బతకవచ్చని డాక్టర్లు చెప్పారు. కానీ, కుటుంబాన్ని పోషించడమే భారంగా మారిన ఉపేందర్‌కు ఆపరేషన్‌ చేయించుకునే స్థోమత లేకపోవడంతో దుఃఖసాగరంలో మునిగిపోయాడు.

ఆపరేషన్‌కు రూ.8 లక్షలు..

రెండు కిడ్నీలు చెడిపోయి మంచంపట్టిన కుమారుడిని పరిస్థితిని చూసిన తండ్రి వెంకటయ్య కిడ్నీ ఇచ్చేందుకు ముందుకొచ్చాడు. కానీ, కిడ్నీ మార్పిడికి రూ.8 లక్షల వరకు ఖర్చు అవుతుందని డాక్టర్లు చెప్పారు. ఆపరేషన్‌ ఆరోగ్యశ్రీలో చేసే అవకాశం ఉన్నప్పటికీ ఇద్దరిలో ఒకరికే ఆరోగ్యశ్రీ వర్తిస్తుందని వైద్యులు చెప్పడంతో ఆర్థికస్థోమత లేని ఉపేందర్‌ ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నాడు. దాతలు ఆదుకోవాలని ఉపేందర్‌తోపాటు అతని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

దాతలు 97046 10919 ఫోన్‌ పే నంబర్‌కు తోచిన సాయం అందించి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం

- అనాథలైన పిల్లలు
- గూడ్స్‌ వాహనం డ్రైవర్‌ అజాగ్రత్తతో ప్రమాదం


సుభాన్‌(ఫైల్‌)


సబ్రిన్‌(ఫైల్‌)


తల్లిదండ్రుల మృతితో అనాథలుగా మారిన చిన్నారులు నవాజ్‌, సోని

గీసుకొండ: సాఫీగా సాగుతున్న కుటుంబాన్ని రోడ్డు ప్రమాదం రూపంలో వచ్చిన మృత్యువు చిన్నాభిన్నం చేసింది.. ప్రమాదంలో దంపతులు దుర్మరణం చెందడంతో ముగ్గురు పిల్లలు అనాథలయ్యారు. వరంగల్‌ జిల్లా గీసుకొండ మండలం కోటగండి సమీపంలో పీడీఆర్‌ ఫంక్షన్‌ హాల్‌ ఎదుట వరంగల్‌–నర్సంపేట రహదారిపై శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదానికి సంబంధించి, మృతుల బంధువులు, గీసుకొండ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. వరంగల్‌ నగరంలోని కరీమాబాద్‌ ఉర్సు దర్గాకు చెందిన ఎండీ సుభాన్‌(35), సమ్రిన్‌ (29) అనే దంపతులకు ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. భార్యాభర్తలు ఉదయం తమ కొత్త సీఎన్‌జీ ఆటోలో పిల్లలు సుమాయ, సోని, నవాజ్‌లను ఎక్కించుకుని నగరంలోని స్కూల్‌లో వదిలిపెట్టారు. అనంతరం గీసుకొండ మండలంలోని వరంగల్‌–నర్సంపేట రహదారిలో దస్రు తండా సమీపంలో సీఎన్‌జీ బంక్‌లో గ్యాస్‌ నింపుకుని ఉదయం 11.10 గంటల సమయంలో తిరిగి వరంగల్‌ నగరానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో పీడీఆర్‌ గార్డెన్స్‌ వద్ద వరంగల్‌ నుంచి నర్సంపేట వైపు వెళ్తున్న సరుకుల రవాణా ట్రక్కు డ్రైవర్‌ అతి వేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ వారి ఆటోను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో సమ్రిన్‌ అక్కడే మృతి చెందగా, సుభాన్‌ను 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. సుభాన్‌ మామ ఎండీ సోఫీ ఫిర్యాదు మేరకు ట్రక్‌ డ్రైవర్‌ గడ్డం జస్వంత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్‌ మహేందర్‌ తెలిపారు.

బీటెక్‌ విద్యార్థి ఆత్మహత్య



గీసుకొండ: వరంగల్‌ జిల్లా గీసుకొండ మండల కేంద్రానికి చెందిన బీటెక్‌ విద్యార్థి చాపర్తి ముక్తానంద్‌(19) శుక్రవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గీసుకొండ పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ముక్తానంద్‌ కొన్ని రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు, రక్త కణాలు తగ్గిపోవడంతో పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందినా ఫలితం లేకపోవడంతో మానసికంగా కుంగిపోయాడు. ఈ క్రమంలోనే జీవితంపై విరక్తి చెంది మధ్యాహ్నం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు చేసుకున్నాడు. మృతుడి తండ్రి చాపర్తి సుధాకర్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్‌ మహేందర్‌ తెలిపారు.